## క్లుప్తంగా

### శివుని విగ్రహం ఏర్పాటు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస గ్రామంలోని శ్మశానవాటికలో శివుని విగ్రహాన్ని హెల్ రైడర్స్ యూత్ సభ్యులు శుక్రవారం ఏర్పాటు చేశారు. యువత తమ సొంత నిధులతో విగ్రహం కొనుగోలు చేసి, ఏర్పాటు చేయడాన్ని గ్రామస్తులు అభినందించారు.

### ప్రతిభావంతులకు అవార్డులు



మాసాపు రోహిత్



బొంత సందీప్

భామిని: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా అవార్డులు ప్రకటించిందని ఎంఈఓలు వి.భాస్కరరావు, ఎ.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలానికి చెందిన మాసాపు రోహిత్, బొంత సందీప్, మీసాల వరుణ్ సందేష్, గాజో జగదీష్, గాజో రీతు, బిడ్డిక వర్షిణి, కడగల కుసుమ అవార్డులకు ఎంపికయ్యారని చెప్పారు.

### 9న మండల సర్వసభ్య సమావేశం

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 9వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ధర్మారావు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా వస్తున్నారని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

### స్కాలర్‌షిప్‌కు మోడల్ విద్యార్థులు ఎంపిక



స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించిన మోడల్ విద్యార్థులు

భామిని: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎన్ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు గులివిందల సౌమ్యశ్రీ, కోలక లీనశ్రీ, మజ్జి దీపిక, రాజాన ఉమాదేవిలను అభినందించారు.

### మలేరియాపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: మలేరియా రహిత సమాజమే ధ్యేయంగా సిబ్బంది క్షేత్ర స్థాయిలో సేవలు అందించాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలో మలేరియా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మలేరియాపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. వర్షాకాల సీజన్‌లో గ్రామీణ ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీలు, ఇతర సాంకేతిక మార్గాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు.

### రైతు సేవా కేంద్రానికి చేరిన వరి విత్తనాలు



కొండాపురం ఆర్‌ఎస్‌కే వద్ద వరి విత్తనాల వ్యాన్

పాలకొండ: మండలంలోని కొండాపురం రైతు సేవా కేంద్రానికి వరి విత్తనాలు శుక్రవారం చేరాయి. ఈ ఆర్‌ఎస్‌కే పరిధిలో ఉన్న ఎన్‌కే రాజపురం, కొండాపురం గ్రామాల పరిధిలోని రైతులు విత్తనాల కోసం తమను సంప్రదించాలని ఏఓ వాహిని సూచించారు. ఆర్‌ఎస్‌కేలో అందుబాటులోని లేని విత్తనాల కోసం రైతులు తమ పేర్లు నమోదు చేసుకుంటే వాటిని తీసుకుస్తామని తెలిపారు.

### పరామర్శ



దినేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి దంపతులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చిన మేరంగి, జోగురాజుపేట, శిఖబడి గ్రామాల్లో ఇటీవల చనిపోయిన వారి కుటుంబ సభ్యులను, ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం కలిసి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

# దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు

- ఇటీవల కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నిల్వ ఉంటున్న నీరు
- దోమల వృద్ధిని కట్టడి చేయాలంటున్న వైద్యులు



ఈ తరహా ప్రదేశాలే దోమలకు ఆవాసాలంటున్న వైద్య సిబ్బంది

పాలకొండ రూరల్: వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం పొంచి ఉంది. ప్రస్తుతం వర్షాలు భారీగా కురుస్తున్నాయి. పల్లపు ప్రదేశాల్లో చేరిన వర్షపు నీరు అక్కడే నిల్వ ఉండిపోతోంది. ఇది మురుగుమయమై దోమలకు ఆవాసంగా మారుతోంది. దోమల దాడితో పాటు మారిన తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు, పరిశుభ్రత లోపించిన పరిసరాలు, కలుషిత నీరు ప్రజల ఆరోగ్య స్థితిగతులపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా దోమల వల్ల కలిగే అనర్థాలు, వచ్చే జబ్బులు, జ్వరాలు వాటి లక్షణాలపై అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ మేరకు గ్రామ స్థాయిలో అవగాహన ర్యాలీలు చేపడుతున్నారు.

**మలేరియా, డెంగీ లక్షణాలు..**

ప్రస్తుత సీజన్‌లో వృద్ధి చెందే అనాఫిలిస్ అనే దోమ కాటు వల్ల మలేరియా జ్వరం వ్యాపిస్తుంది. నిల్వ ఉన్న నీరు లేదా తాగునీటిలో ఈ తరహా దోమ వృద్ధి చెందుతుంది. ఈ దోమ కాటు కారణంగా వచ్చిన జ్వరం దాదాపు రెండు వారాలు ఉంటుంది. వాంతులు కూడా అవుతుంటాయి. సాధారణంగా ఇంటి లోపల, బయట నిల్వ ఉన్న నీటిలో డెంగీ దోమ గుడ్లు పెడుతుంది. ఈ వ్యాధి సోకితే 15 రోజుల పాటు జ్వరం అధికంగా ఉంటుంది. తలనొప్పి, నొసటిపై, కంటి లోపల నొప్పితో పాటు కడుపు నొప్పి కూడా వస్తూ ఉంటుంది.

**క్యూలెక్స్ దోమ కారణంగా...**

మెదడువాపు వ్యాధి ప్రాణంతకమైనది. క్యూలెక్స్ దోమ వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ దోమ ఎక్కువ రోజుల పాటు మురుగునీటిలో పెరుగుతుంది. 14 రోజుల పాటు తీవ్రమైన జ్వరంతో బాధపడతారు. మత్తుగా సోలిపోతుంటారు. ఈ జ్వరం తీవ్రమైతే బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాధారణంగా ఈ జ్వరం రెండు నుంచి 14 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. ఈడిస్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలు ఉంటాయి. ఈ వ్యాధి బారిన పడిన రోగి 10 – 14 రోజుల పాటు తీవ్ర నొప్పులతో కూడిన జ్వరంతో బాధపడతాడు. జ్వరం తగ్గినా మరో 10 రోజుల పాటు ఒంటి నొప్పులు తీవ్రంగా ఉంటాయి.

**దోమల నియంత్రణకు చర్యలు..**

- పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి.
- వీధి కాలువలు, ఇంట్లో వాడుక నీరు సక్రమంగా పారేలా చూసుకోవాలి.
- పరిసర ప్రాంతాల్లో కంపు చెట్లు, పిచ్చిమొక్కలు లేకుండా జాగ్రత్తలు వహించాలి.
- ఇళ్ల మధ్య, ఖాళీ స్థలాలు, గోతుల్లో నీరు నిలిచి, మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికి ఒకసారి దోమల నియంత్రణ మందు వేయాలి.
- మలాథియాన్ పిచికారీ చేయించడం వల్ల ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.
- దోమలు కుట్టకుండా దోమ తెరలు ఇతరత్రా విధానాలు అవలంభించాలి.
- ఫాగింగ్ తరచూ చేయడం వల్ల దోమలను నియంత్రించవచ్చు.

**రక్షణ చర్యలు చేపట్టాలి..**



ప్రస్తుత సీజన్‌లో దోమల కారణంగా జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయి. వైరల్ ఫీవర్ వస్తే మందులు వాడితే తగ్గుతుంది. అలా కాకుండా జలుబు, తలనొప్పి, వాంతులు, ఒంటిపై దద్దుర్లు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. అలసత్వం వహిస్తే రోగ తీవ్రత పెరుగుతుంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో రోగ కారకాలను అధిగమించాలి.

– వి.కమల్‌నాథ్, వైద్యాధికారి, అన్నవరం పీహెచ్‌సీ, పాలకొండ మండలం

## పైనాపిల్‌కు మద్దతు ధర కల్పించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ప్రస్తుత సీజన్‌లో ఏజెన్సీలో పండే పైనాపిల్ పండ్లకు మద్దతు ధర కల్పించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతాల్లో టన్నుల కొద్దీ పైనాపిల్ పంట రైతుల చేతికి వస్తున్నప్పటికీ సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవిచూస్తున్నారన్నారు. ప్రారంభంలో ఉన్న పైనాపిల్ ఒక్కొక్కటీ రూ. 15కు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం ఐదు రూపాయలకు కూడా కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ ద్వారా రైతుల నుంచి పైనాపిల్ కొనుగోలు చేసి వెలుగు, ఉద్యానవన శాఖాధికారుల ఆధ్వర్యంలో విక్రయించడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరిందని తెలిపారు.

**90 శాతంపై విత్తనాలు..**

గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు సరఫరా చేయాలని మాజీ ఎమ్మెల్యే కళావతి కోరారు. రైతులకు విత్తనాల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత వ్యవసాయశాఖపై ఉందన్నారు. ఏడాది కాలంగా ఎటువంటి పెట్టుబడి సాయం లేక అల్లాడుతున్న గిరిజన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హెచ్.మోహనరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, చెంచయ్య, ఎస్.సాయికుమార్, బి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## జీసీసీ టెండర్లు ఖరారు



ఐటీడీఏ పీఓ సమక్షంలో టెండర్లు నిర్వహిస్తున్న జీసీసీ అధికారులు

సీతంపేట: గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలకు పంపిణీ చేసే నిత్యావసర సరుకుల టెండర్లు ఖారారయ్యాయి. ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సమక్షంలో టెండర్లు జరిగాయి. జూన్ నుంచి ఆగస్టు వరకు సరఫరా చేయాల్సిన 31 రకాల సరుకులకు సంబంధించి శుక్రవారం టెండర్లు నిర్వహించగా.. 8 మంది ట్రేడర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, జీసీసీ డీఎం సంధ్యారాణి, మేనేజర్లు డి.కృష్ణ, జి.నరసింహులు, ఏటీడబ్ల్యూఓ మంగవేణి, హెచ్‌డబ్ల్యూఓలు పి.అమల, హెచ్.శారద, వెంకటినాయుడు, రాజారావు, పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి



పుష్పశ్రీవాణి దంపతులను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న గోపాల్ తదితరులు

జియ్యమ్మవలస రూరల్: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలని మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు సూచించారు. పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీగా రెండోసారి నియమితుడైన గుమ్మలక్ష్మీపురానికి చెందిన నిమ్మక గోపాల్..ఎంపీపీ దీనమయ్య ఆధ్వర్యంలో చినమేరంగిలో పుష్పశ్రీవాణి దంపతులను శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టినందుకు ఆనందంగా ఉందని, తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిందుకు కృతజ్ఞతలని గోపాల్ తెలిపారు.

అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సర్పంచ్ సూర్యం తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అడవులు పెంచాలి



విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

భామిని: సామాజిక అడవుల పెంపకానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వెలుగు అసోసియేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండలంలోని తివ్వాకొండ శివారు రేగిడి గిరిజన గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించి కాగు, చింత, పనస, విప్ప, నేరేడు విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు పీసీఓ బి.క్రాంతికుమార్, ఏసీ ఓ. గోపాలరావు, ఎస్. గోపాలరావు, భాగ్యవతి, జగ్గయ్య, గిరిజనులు బిడ్డిక వెంకటరావు, బిడ్డిక లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## 'గాయత్రి మహాయజ్ఞం'

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాంలోని గాయత్రి ప్రజ్ఞాపీఠంలో గాయత్రి జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు కుండీల గాయత్రి మహాయజ్ఞం చేపట్టారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ బత్తుల గురుమూర్తి, సీర సత్యనారాయణ, ఆదినారాయణ, శంకరరావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతులు ఆపాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల హెచ్‌డబ్ల్యూవో(హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్)ల పదోన్నతులు ఆపాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం డిమాండ్ చేశారు. నాలుగో తరగతి ఉద్యోగులు, ఎస్జీటీ ఉపాధ్యాయులకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌లుగా పదోన్నతులు ఇచ్చేందుకు డీడీ కార్యాలయం విభాగం అధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. అర్హులకు మాత్రమే పదోన్నతులు దక్కేలా ఐటీడీఏ అధికారులు పత్రికా ప్రకటన చేయాలన్నారు. అప్పటివరకు ఈ ప్రక్రియను నిలిపివేయాలని, పార్వతీపురం ఐటీడీఏ పీవో ఈ అంశంపై దృష్టిసారించాలని కోరారు.

## పాఠశాలలకు పుస్తకాల తరలింపు



గరుగుబిల్లి నుంచి ఇతర గ్రామాల్లోని పాఠశాలలకు ఆటోల్లో తరలిస్తున్న పుస్తకాలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(స్టాక్ పాయింట్) నుంచి ప్రభుత్వ పాఠ్య, నోటు పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలలకు శుక్రవారం తరలించారు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు ఈ విద్యార్థి మిత్ర కిట్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, దానిలో భాగంగానే ఇప్పటి నుంచే పుస్తకాల తరలింపు చర్యలు చేపడుతున్నట్లు ఎంఈవో2 కె.కొండలరావు తెలిపారు. మండలంలోని మొత్తం 58 పాఠశాలలకు 15,294 పుస్తకాలు వచ్చాయని, ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా పుస్తకాల పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

## తోటపల్లిలో అక్షరాభ్యాసం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం వద్ద పలువురు చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి, చిన్నారులతో అక్షరాలు దిద్దించి, అభ్యాసం చేయించారు. గతంలో అక్షరాభ్యాసం కోసం విజయనగరంలోని సరస్వతీదేవి ఆలయానికి వెళ్లేవారని ఇప్పుడు ఇక్కడే కొత్తగా అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడంతో ప్రత్యేక పర్వదినాల్లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

## ● ప్రమాదాలకు పిలుపు..



పాలకొండ మండలంలోని అర్దలి కూడలి వయా భాసూరు మీదుగా ఎల్.ఎల్.పురం, కోటిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి నిత్య ప్రమాదాలకు నెలవుగా మారింది. ముఖ్యంగా అంతర్గత గ్రామాలను కలుపుతూ పోయే సుమారు 10 కిలోమీటర్ల రోడ్డులో భారీగా మలుపులున్నాయి. ఇరువైపులా పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.అధికారులు స్పందించి మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పాలకొండ నగర పంచాయతీ కమిషనర్ కె.రత్నంరాజ్ అన్నారు. 40 రోజులుగా స్థానిక శాఖా గ్రంథాలయంలో కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలన్నారు. పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలు వివరించడంతో పాటు శిబిరం ద్వారా విద్యార్థులకు అవసరమైన సాంస్కృతిక, కళా రంగాలతో పాటు ఫ్యాషన్ డిజైనింగ్, చిత్రలేఖనం, యోగా, ఆటపాటల్లో నిపుణలచే తర్ఫీదు అందించినట్లు గ్రంథపాలకుడు బబ్బూరి గణేష్‌బాబు తెలియజేశారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కె.జనార్ధనరావు, జి.మురళి, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా ఉండండి..

పాలకొండ రూరల్: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాన రహదారులు, వీధి కూడళ్ల వద్ద, వ్యాపార సముదాలయాలపై ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు, ప్రచార సైన్, గ్లోసిన్ బోర్డుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలున్నాయన్నారు. వర్షంతో పాటు భారీ గాలులు వీస్తుండడంతో హోర్డింగ్‌లు పడిపోయే అవకాశం ఉందని చెప్పారు. పట్టణ, మండల స్థాయిలో ఉన్న ఈ తరహా బోర్డుల నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైతే తమ సిబ్బంది సహకరిస్తారని తెలిపారు.

## ముగిసిన వేసవి శిక్షణ



గుమ్మలక్ష్మీపురం: సర్టిఫికెట్లతో విద్యార్థులు, సిబ్బంది

గరుగుబిల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో రోజూ గ్రంథాలయానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తకపఠనం, వక్తృత్వం, చిత్రలేఖనం, క్విజ్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు క్యారమ్, చదరంగం వంటి ఆటలపోటీల్లో మెలకువలు నేర్పించారు. ముగింపు కార్యక్రమంలో ఆటపోటీల్లో గెలుపొందిన వారికి లైబ్రేరియన్లు బహుమతులు అందజేశారు.

గుమ్మలక్ష్మీపురం: శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ మేరకు ఇదివరకు జరిగిన శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థుల మధ్య చేపట్టిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి లైబ్రేరియన్ డి.సుకన్య.. సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సీతంపేట: ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, కేవీకే రస్తా కుంటుబాయి ఆధ్వర్యంలో కిరప గ్రామంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం, వరి, చిరుధాన్యాల వ్యవసాయ పద్ధతులపై వివరించారు. జీడిలో అంతరపంటలు, నవధాన్యాల యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు అనంత విహారి, హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రదీప్, డీఆర్‌సీ శ్రీనివాస్, ఎస్.శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, విశ్వనాథరెడ్డి, వీఏఏ వై.తిరుమలరావు, బి.నరేష్, లత, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులో వరి విత్తనాలు



ఎల్విన్‌పేట రైతు సేవా కేంద్రం వద్ద వరి విత్తనాలు అన్‌లోడ్ చేస్తున్న సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ఖరీఫ్ సాగుకు సంబంధించి, 1578 క్వింటాళ్ల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు ఏవో సీహెచ్ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఆర్‌జీఎల్ 537 రకం విత్తనాలు 757 క్వింటాళ్లు, ఎంటీయూ 1064 రకం విత్తనాలు 179 క్వింటాళ్లు, ఎంటీయూ 1121 రకం విత్తనాలు 168 క్వింటాళ్లు, ఆర్ఎస్ఆర్ 15048 రకం విత్తనాలు 316 క్వింటాళ్లు మండలానికి వచ్చాయని, వాటిని రైతు సేవా కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు. 90 శాతం రాయితీపై ఇచ్చే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జియ్యమ్మవలస రూరల్: రైతులకు అవసరమైన వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన వారు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని విత్తనాలు పొందాలని ఏవో విజయభారతి తెలిపారు.

## నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పాలకొండ: నగర పంచాయతీకి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పాడవ్వడంతో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందని కమిషనర్ రత్నంరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 3, 4, 5, 6, 7, 8 వార్డుల పరిధిలో శనివారం ఉదయం కుళాయిల ద్వారా నీటి సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

## వీధిలైట్లు ప్రారంభించిన కలెక్టరు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్

కొమరాడ: మండలంలోని చినఖేర్జిల పంచాయతీ, బంజకుప్ప గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన వీధి లైట్లను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనకల్యాణ సంస్థ ఆధ్వర్యంలో సిగ్నిఫై ఇన్నోవేషన్ ఇండియా సహకారంతో నాలుగు మండలాల్లోని దాదాపు 230 గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడం అనేది అభినందనీయమన్నారు. ఆ కంపెనీ తన సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా ఈ సదుపాయం కల్పించినట్లు కలెక్టరు పేర్కొన్నారు. అనంతరం గ్రామ ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

కొమరాడ: మత్స్య సంపద పెంచాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని కోటిపాం గ్రామంలో చేపల పెంపకానికి సిద్ధం చేసిన చెరువును ఆయన శుక్రవారం ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఇక్కడ చేపట్టే చేపపిల్లల పెంపకాన్ని ఆదాయ వనరుగా మార్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.